సాక్షి
గుంటూరు
శుక్రవారం । 23 । జూన్ । 2023



ఆరోగ్య లక్ష్యాలు సాధించాలి

గుంటూరు మెడికల్: ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని డీఎంహెచ్‌ఓ శ్రావణ్ బాబు చెప్పారు. గురువారం గుంటూరులో వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.



కార్తికేయుడి ఆదాయం

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా రూ.85,20,197 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ చక్రధరరావు తెలిపారు.

నేడు డీఎస్సీ-98 ఎంటీఎస్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

గుంటూరు ఎడ్యుకేషన్: 1998-డీఎస్సీ ద్వారా ఎంపికై మినిమం టైం స్కేల్ పద్ధతిపై పని చేస్తున్న అభ్యర్థులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.శైలజ గురువారం తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలను కేటాయిస్తామని పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

ముగిసిన బదిలీల కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో మంగళవారం నుంచి జరుగుతున్న వైద్య సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. గురువారం పీహెచ్‌ఎన్, హెచ్‌ఈ, ఎంపీహెచ్‌ఈఓ, ఏపీఎంఓ, ఎంపీహెచ్‌ఎస్ మేల్, డీపీఎంఓ క్యాడర్‌లకు చెందిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు అందజేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, సూపరింటెండెంట్‌లు గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సుధీర్ కుమార్, పలువురు సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేతన్న నేస్తం నిబంధనలు సడలింపు



వేటపాలెం: ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం అమల్లో కొన్ని నిబంధనలు సడలించినట్లు దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర తెలిపారు. పందిళ్లపల్లిలో నేతన్న నేస్తం పథకం లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్‌తో కలిసి ఆయన గురువారం కలిశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఈ ఏడాది నేతన్న నేస్తం పథకం అమలుకు దరఖాస్తు స్వీకరణతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతోందని వివరించారు. గతంలో జీఎస్టీ బిల్లులతోపాటు మాస్టర్ వీవర్స్ వద్ద ధ్రువీకరణ పత్రాలు కావాలని సచివాలయ సిబ్బంది అడిగినట్లు చేనేతలు తమ దృష్టికి తీసుకొచ్చారని, ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిబంధనలు సడలించాలని కోరామని, సీఎం వెంటనే స్పందించి నిబంధనలు సడలించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. సీఎం జగనన్నకు చేనేతల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. నేతన్నలు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పథకం అమల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా చేనేతలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హులందరికీ నేతన్న నేస్తం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సడలించిన నిబంధనల ప్రకారం సచివాలయ సిబ్బంది అర్హులైన ప్రతి ఒక్క చేనేతకు పథకం అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ కేసన్యా, వలంటీర్లు పాల్గొన్నారు.

యార్డుకు 34,421 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు) : గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 34,421 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 31,417 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

- నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9 వేలు నుంచి రూ.24 వేల వరకు పలికింది.
- నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9 వేలు నుంచి రూ.25,200 వరకు పలికింది.
- ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.9,800 నుంచి 23 వేలు వరకు ధర లభించింది.
- ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10 వేల నుంచి రూ. 24,500 వరకు ధర పలికింది.
- తాలు రకం మిర్చికి రూ.ఐదు వేల నుంచి రూ.14 వేల వరకు ధర లభించింది.

అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,755 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.1000, గరిష్ఠ ధర రూ.2,300, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

అహోరాత్రీ వెలుగులు

- ఇక గ్రామాలకూ త్రీఫేజ్ కరెంట్
- ఆర్‌డీఎస్‌ఎస్ ద్వారా రూ. 500 కోట్లు
- రూ.166 కోట్లతో కొత్త లైన్లు
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రాంతాల్లో అదనంగా రూ.50 కోట్లు ఖర్చు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోంది. ముఖ్యంగా గృహ, కుటీర పరిశ్రమలు, చిరు వ్యాపారాలు అభివృద్ధి చెందాలంటే నాణ్యమైన విద్యుత్ సరఫరా ఎంతో అవసరం. 24 గంటలూ గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పల్లెల్లో కరెంట్ అంతరాయాన్ని నివారించి, నిరాటంక సరఫరా కోసం రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (ఆర్డీఎస్ఎస్)ను అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిలో భాగంగా గ్రామాలన్నింటికీ త్రీఫేజ్ కనెక్షన్లు ఇచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పాత కండక్టర్లు, తీగల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం కోస్టల్ కారిడార్ హైవే పక్కన 33 కేవీ లైన్లు వేస్తున్నారు.

గ్రామీణ ప్రాంత ఫీడర్ల ఆధునికీకరణ

గుంటూరు సర్కిల్ పరిధిలో 11 కేవీ ఫీడర్లు 944 ఉన్నాయి. అందులో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాలలో ఉన్న ఫీడర్లు 527 కాగా, మరికొన్ని పారిశ్రామిక ఫీడర్లు ఉన్నాయి. వీటన్నింటికీ త్రీఫేజ్ కరెంట్ ఇస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, ఇతర వ్యవసాయ ఫీడర్లు 370 ఉన్నాయి. వీటిని ఆధునికీకరించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా ఈ 370 రూరల్ ఫీడర్లను త్రీఫేజ్ లైన్లుగా మార్చేందుకు సమాంతరంగా మరో లైన్ వేయాలని నిర్ధారించారు. అవసరమైన చోట్ల ఫీడర్లను కూడా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఆర్డీఎస్ఎస్ విజయవంతానికి మొత్తం రూ.500 కోట్లు వెచ్చిస్తున్నారు. పనులను టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఏజెన్సీలకు అప్పగించారు. త్వరలో పనులు మొదలు కానున్నాయి. వీటితో పాటు సముద్ర తీర ప్రాంతం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రాంతాల్లో అదనంగా రూ. 50 కోట్లు వెచ్చించి విద్యుత్ సరఫరాను పటిష్ట పరిచే చర్యలు చేపట్టారు. పాత లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడానికి రూ.166 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. దీంతో పాత ట్రాన్స్‌ఫార్మర్లు మొరాయిస్తున్నాయి. ఫలితంగా గుంటూరు నగరంలో పెద్ద ఎత్తున ట్రాన్స్‌ఫార్మర్లను మార్చారు. దీనివల్ల ముఖ్యంగా తూర్పు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా గణనీయంగా మెరుగుపడింది.



గుంటూరులోని ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం



ఉపకేంద్రంలోని ఫీడర్

ప్రత్యేక లైన్లు



ఆర్డీఎస్ఎస్ స్కీమ్‌లో ముఖ్యంగా గ్రామీణ ఫీడర్ల నుంచి వ్యవసాయ కనెక్షన్లు విడగొడుతూ ప్రత్యేక లైన్లు వేస్తారు. దీంతో గ్రామాలకు 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరాకు అవకాశం మెరుగుపడుతుంది. కుటీర పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. అభివృద్ధి వికేంద్రీకరణకు గ్రామాల అభివృద్ధికి ఈ స్కీమ్ దోహదపడుతోంది.

– మురళీకృష్ణ యాదవ్, సూపరింటెండెంట్ ఇంజినీర్





ఉద్యోగ మేళా.. ఉత్సాహం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం ఉద్యోగ మేళా ఉత్సాహంగా జరిగింది. భారీగా యువకులు తరలివచ్చారు. 75 సంస్థల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగులను ఇంటర్వ్యూలు చేశారు. శుక్రవారం కూడా జాబ్‌మేళా కొనసాగనుంది. దాదాపు పదివేల ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఏఎన్‌యూ సెంటర్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ డాక్టర్ జి.నాగరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

– ఏఎన్‌యూ(గుంటూరు)

పీఎం కిసాన్‌కు ‘ఈ-కేవైసీ’ తప్పనిసరి

- నెలాఖరు వరకు గడువు ఇచ్చిన కేంద్రం
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు

కొరిటిపాడు(గుంటూరు): ప్రధానమంత్రి కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందే రైతులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ-కేవైసీ) చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏఓ) నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. 12వ విడత లబ్ధికి ఈ-కేవైసీ తప్పనిసరి చేసినా.. గతేడాది 12, 13వ విడతల సొమ్ము ఎలాగోలా జమ చేశారని పేర్కొన్నారు. త్వరలో ఇవ్వనున్న 14వ విడత పీఎం కిసాన్‌కు కచ్చితంగా ఈ-కేవైసీ ఉండాల్సిందేనని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతూ ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరు, అలాగే ఓటీపీ ఆధారంగా ఈనెల 30వ తేదీ లోపు అథెంటిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. మీ సేవ లేదా కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ), రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్లను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి వేలిముద్రలతో ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. లేదంటే www.pmkisan.gov.in అనే లింక్‌ను ఉపయోగించి స్వయంగా ఇంటర్‌నెట్ కలిగిన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలోనూ చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.

జిల్లాలో 13,629 పెండింగ్

గుంటూరు జిల్లా వ్యాప్తంగా 94,600 పీఎం కిసాన్ అకౌంట్లు ఉండగా.. ఇంకా 13,629 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదని డీఏఓ తెలిపారు. అందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని, ఒకసారి జాబితా నుంచి డిలీట్ అయితే తర్వాత చేర్చుకోవడం కష్టమని పేర్కొన్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.7,500 పెట్టుబడి సాయం పొందడానికి సమస్యగా మారవచ్చని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి ఈ-క్రాప్ డేటా ఆధారంగా ఈ-కేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి ఆర్‌బీకే అసిస్టెంట్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు.

పరవానందం



గుంటూరు ఉమెన్స్ కాలేజీ రోడ్డులో వర్షపునీరు

- విస్తరించిన ఆశల ‘నైరుతి’
- జిల్లాకు వర్ష సూచన
- సర్వత్రా సంతోషం

కొరిటిపాడు(గుంటూరు): ఆలస్యంగానైనా నైరుతి రుతు పవనాలు జిల్లా అంతటా విస్తరించాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ ధ్రువీకరించింది. ఈనెల 8న కేరళను తాకిన నైరుతి రుతు పవనాలు 18న గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలనూ తాకాయి. కానీ.. వాతావరణం అనుకూలించక మూడు, నాలుగు రోజులు దోబూచులాడిన పవనాల్లో బుధవారం కదలిక వచ్చింది. గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు రుతు పవనాలు విస్తరించినట్లు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. రుతుపవనాలు ముందుకు కదలడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, రాగల మూడు, నాలుగు రోజులపాటు జిల్లాకు వర్ష సూచన ఉందని స్పష్టం చేస్తున్నారు. ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవవచ్చని చెబుతున్నారు.

రైతుల ఆనందం

తొలకరి వర్షాలు ప్రారంభంతో కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులతో సిద్ధంగా ఉన్న రైతులు ఖరీఫ్ సేద్యానికి సమాయత్తమవుతున్నారు. జూలై చివరి వరకు విత్తుకు మంచి అదును అని వ్యవసాయ శాఖ అధికారులు, లాం ఫాం శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇంకా సమయం ఉన్నందున అన్నదాతలు హుషారుగా పొలాల బాట పడుతున్నారు. ఈ ఏడాది జూన్ తొలి వారంలోనే సాగునీరు విడుదల చేసిన విషయం తెలిసిందే.



గుంటూరు మూడు వంతెనల వద్ద పొంగిపొర్లుతున్న వర్షపునీరు

మండలాల వారీగా వర్షపాతం ఇలా(మిల్లీ మీటర్లలో)..

మండలం	వర్షపాతం
ఫిరంగిపురం	49.8
ప్రత్తిపాడు	33.2
తాడికొండ	26.2
కాకుమాను	26.0
తుళ్ళూరు	22.8
గుంటూరు పశ్చిమ	14.8
పెదనందిపాడు	12.2
మంగళగిరి	04.0
తాడేపల్లి	02.6
వట్టిచెరుకూరు	01.4



మేడికొండూరులో అత్యధికం

గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా మేడికొండూరు మండలంలో 58.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 1.2 మి.మీ వర్షం పడింది. సగటున 14 మి.మీ వర్షపాతం నమోదైంది.

హే ‘సర్వే’శా!

నగర ప్రజలకు సర్వే తిప్పలు

- నెల నుంచి సర్వేయర్లు లేకపోవడంతో ఇబ్బందులు
- పేరుకుపోతున్న దరఖాస్తులు
- పట్టించుకోని అధికారులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): నగరపాలక సంస్థలో టౌన్ సర్వేయర్లు లేకపోవడంతో గుంటూరు వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ల డెప్యూటేషన్లు రద్దు చేయడంతో గత నెల 21 నుంచి వారు అందుబాటులో లేకుండా పోయారు. ఫలితంగా సర్వే దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెల గడుస్తున్నా.. అధికారులు కొత్త సర్వేయర్ల నియామకం చేపట్టడం లేదు.

ఏడాదిగా డెప్యూటేషన్‌పైనే!

గుంటూరు నగరపాలక సంస్థలో ఏడాదికి ముందు వరకు తూర్పు నియోజకవర్గానికి శ్రీనివాసరాజు, పశ్చిమ నియోజకవర్గానికి సుధాకర్ సర్వేయర్లుగా ఉండేవారు. అయితే వారు బదిలీ కావడంతో నగర పాలక సంస్థలో సర్వేయర్ల పోస్టులు ఖాళీగా మారాయి. ఆ సమయంలో బాధ్యతలు చేపట్టిన నగర కమిషనర్ కీర్తి చేకూరి సర్వేయర్ల కొరతను గుర్తించి జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి నగరపాలక సంస్థకు ఇద్దరు సర్వేయర్లను డెప్యూటేషన్‌పై తీసుకొచ్చారు. తూర్పు నియోజకవర్గానికి హరికృష్ణను, పశ్చిమ నియోజకవర్గానికి సునీల్‌కుమార్‌ను కేటాయించారు. దీంతో ఏడాదిగా సర్వే పనులకు ఆటంకాలు కలగలేదు. గత నెల 20న డెప్యూటేషన్లు రద్దుతో ఇద్దరు సర్వేయర్లు మాతృశాఖకు రిపోర్టు చేయాల్సి వచ్చింది.

వందల సంఖ్యలో సర్వే దరఖాస్తులు పెండింగ్

బ్యాంకు రుణాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్, వీఎల్‌టీ(ఖాళీ స్థల పన్ను), రోడ్డు విస్తరణ పనులకు నగరపాలక సంస్థ సర్వేయర్లు ఇచ్చే నివేదికే ప్రధానం. గత నెల 21 నుంచి సర్వేయర్లు లేకపోవడంతో దరఖాస్తులు వందల సంఖ్యలో పేరుకుపోయాయి. త్వరగా సర్వే పోస్టులు భర్తీ చేసి తమ కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న సర్వేయర్ సీటు

భర్తీకి చర్యలు

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సర్వేయర్ల డెప్యూటేషన్లు రద్దు చేస్తూ గత నెలలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా.. ఆమె దాదాపు పది లక్షల జనాభా కలిగిన గుంటూరు నగరపాలక సంస్థకు నలుగురు సర్వేయర్లు కావాలని కమిషనర్ ఆఫ్ సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్‌కు లేఖ రాశారు. త్వరలో సర్వేయర్ల కేటాయింపు జరుగుతోంది.

– ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానర్

చకచకా బందరు పోర్టు పనులు

- 190 మీటర్ల మేర దక్షిణపు గోడ నిర్మాణం
- 130 మీటర్ల మేర ఉత్తరపు గోడ పనులు
- కార్గో నిల్వల కోసం భూమి పటిష్టతకు చర్యలు
- పోర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పేర్ని నాని

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు పోర్టు నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తశుద్ధితో ఈ పనులను చేపట్టారని పేర్కొన్నారు. పోర్టు పనులను ముఖ్యమంత్రి ప్రారంభించి గురువారం నాటికి నెల రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా పోర్టు పనుల నిర్మాణ పురోగతిని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పేర్ని నాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచిలీపట్నం, కృష్ణాజిల్లా ప్రజలు దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న పోర్టు నిర్మాణం సాకారం అవుతోందని తెలిపారు. ఇప్పటి వరకు చాలా మంది రాజకీయ నాయకులు ఇవన్నీ ఎన్నికల శంకుస్థాపనలేనని వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు జరుగుతున్న పనులు ప్రజలు సంతోషపడేలా ఉన్నాయని వివరించారు. నెలరోజుల్లో జరిగిన పనులను చూస్తే బందరు పోర్టుపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో ప్రజలకే అర్థం అవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రారంభించిన అనంతరం దక్షిణపు గోడ నిర్మాణం ఇప్పటి వరకు 190 మీటర్ల మేర పూర్తయిందన్నారు. తాను ఈనెల ఎనిమిదో తేదీన ప్రారంభించిన ఉత్తర గోడను 130 మీటర్ల మేర నిర్మించారని చెప్పారు.

90 ఎకరాల్లో కార్గో నిల్వలు

కార్గో నిల్వల కోసం 90 ఎకరాల్లో భూమిని పటిష్టం చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పేర్ని నాని తెలిపారు. పెద్ద పెద్ద కార్గోలను నిల్వ చేసేందుకు ఈ భూమిలో యంత్రం ద్వారా 80 అడుగుల లోతు ఫైబర్ పైప్‌ను పంపి దాని ద్వారా భూమిలోని నీటిని బయటకు తీసుకొచ్చే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఫలితంగా భూమిలో నీటి శాతం తగ్గి నేల గట్టి పడి పటిష్టం అవుతుందని వివరించారు. భూమికి బలం చేకూర్చేందుకు ఆరు నెలల పాటు వేచి ఉన్న అనంతరం కార్గో నిల్వ చేసేందుకు నిర్మాణాలు జరుగుతాయని తెలిపారు.



దక్షిణపు గోడ పనుల గురించి పరిశీలిస్తున్న పేర్ని వెంకట్రామయ్య(నాని)

30న బెర్త్ నిర్మాణం కోసం ఫైల్ టెస్ట్ డిజైన్

పోర్టు నిర్మాణ పనులకు సంబంధించి బెర్త్‌ల నిర్మాణం కోసం పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన నాటి నుంచి భూ సాంద్రత పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 30న బెర్త్ నిర్మాణం కోసం ఫైల్ టెస్ట్ డిజైన్ చేయనున్నట్లు పేర్ని నాని తెలిపారు. ఫైల్ టెస్ట్ రిపోర్టు ఆధారంగా బెర్త్‌లు డిజైన్ చేసి నిర్మాణ పనులను చేపడతామని పేర్కొన్నారు. 30 నెలల్లో పోర్టు నిర్మాణం పూర్తిచేస్తామని గతంలో చెప్పామని గుర్తుచేశారు. అయితే 24 నెలల్లోనే ఈ పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు రేయింబవళ్లు కష్టపడుతున్నారని పేర్ని నాని తెలిపారు. మారిటైమ్ బోర్డు డీఈ శివయ్య, మేఘ ఇంజినీరింగ్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

రేపు క్యాంపస్ డ్రైవ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ / హెచ్‌సీఎల్ టెక్నాలజీ లిమిటెడ్ సంయుక్తంగా ఇంటర్ పూర్తయిన అభ్యర్థులు ఐటీ రంగంలో కెరీర్ ప్రారంభించేందుకు ఈనెల 24న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ రోడ్‌లోని పోస్టాఫీస్ పక్కనున్న ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ కళాశాలలో ఈ డ్రైవ్ జరుగుతుందని వివరించారు. వివరాలకు 63042-92828, 77807-54278 నంబర్లల్లో సంప్రదించాలని చెప్పారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.70 అడుగుల వద్ద ఉంది.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం సమావేశం

తెనాలి: 'అవర్ స్టేట్ అవర్ లీడర్' వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో 'సుపరిపాలనా దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై సమావేశం జరగనుంది. ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి విశిష్ట అతిథులుగా హాజరవుతారని నిర్వాహకులు తెలియజేశారు. గౌరవ అతిథులుగా డాక్టర్ కె.రవికుమార్, సి.సుందర్‌రామ్‌శర్మ, డాక్టర్ ఆర్.జాన్‌బాబు, కోపల్లి జయకర్, బొంతు నాగిరెడ్డి పాల్గొంటారని వివరించారు.

గోవుల అక్రమ రవాణ చేసే వారిపై చర్యలు

పట్నంబజారు: బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29న జరిగే బక్రీద్ పర్వదినం సందర్భంగా పాలిచ్చే గేదెలు, నిషిద్ధ పశువులను అధిక సంఖ్యలో వాహనాల్లో తరలించి గోవధకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహించి, కేసు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. వాహనాల్లో పశువులు తరలించే వారు ఏపీ ఎంవీ యాక్ట్ ప్రకారం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన వారు మాత్రమే తరలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

పోయిన డబ్బు.. తిరిగి ఖాతాల్లోకి..!

- ఇద్దరు బాధితులకు న్యాయం చేసిన సైబర్ క్రైం పోలీసులు
- సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ సూచన



బాధితులతో జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీలు సుప్రజ, శ్రీనివాసరావు

నగరంపాలెం: మోసపోయిన ఇద్దరి బ్యాంక్ ఖాతాల్లోకి గుంటూరు ఐటీ కోర్ (సైబర్ క్రైం) పోలీసులు మళ్లీ నగదు జమ చేయించారు. వివరాల్లోకి వెళ్తే.. తాడేపల్లికి చెందిన దాసరి ప్రభాకర్‌రావు, మేడ వెంకట్రావులు వేర్వేరుగా ఇటీవల కాటర్పిల్లర్ అనే యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ క్రమంలో వారిద్దరూ వేల రూపాయలు పోగొట్టుకున్నారు. దీంతో బాధితులు సైబర్ క్రైంలో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు ఐటీ కోర్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ శ్రీనాథ్ ప్రత్యేక దృష్టిసారించారు. దర్యాప్తులో భాగంగా బాధితుల వద్ద వివరాలు సేకరించి బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. ఈ క్రమంలో ప్రభాకర్‌రావు పోగొట్టుకున్న రూ.90 వేలు, మేడ వెంకట్రావు రూ.50 వేలు మళ్లీ వారి ఖాతాల్లోకి జమ చేయించారు. దీంతో బాధితులు ఇద్దరు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మోసపోయిన డబ్బులు వచ్చే అవకాశం ఉందని అనుకున్నామని, మళ్లీ తమ ఖాతాల్లోకి డబ్బులు జమ చేయించడంపై ఆనందంగా ఉందని బాధితులు ఎస్పీతో చెప్పారు. ఐటీ కోర్ పోలీసుల కృషిని కొనియాడారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఈ తరహా మోసాల బారినపడితే సైబర్ క్రైం ఫోన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, కె.శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ శ్రీనాథ్ పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి ప్రథమ అంతర్ జిల్లాల జూనియర్ బాలుర (అండర్-18) బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు జీవీఎస్ కృష్ణా రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జరిగిన విలేకరుల సమావేశంలో మొత్తం 20 జిల్లాల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ పోటీలను స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో బాస్కెట్ బాల్ క్రీడాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలందిస్తామన్నారు. సమావేశంలో ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి యరగాని శ్రీకృష్ణ పాల్గొన్నారు.

నర్సరీ యాజమాన్యాలు రైతాంగానికి సాయపడాలి

జిల్లా ఉద్యాన శాఖాధికారిణి జెన్నెమ్మ

మార్టూరు: ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటం కోసం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని.. నర్సరీ యజమానులు కూడా రైతుల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి పీ జెన్నెమ్మ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి షేడ్‌నెట్ యజమానుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నర్సరీల చట్టం 2010 ప్రకారం యజమానులు నిబంధనలు పాటించాలన్నారు. మార్టూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ నర్సరీల యాజమానులు రైతులకు అందించే నారుమడులకు విడివిడిగా బిల్లులు రశీదులు రైతులకు అందజేయాలన్నారు. మేలైన విత్తనాలు, ఎరువులు వినియోగించాలని సూచించారు. మార్టూరు ఉద్యాన వనశాఖాధికారి బీ హనుమంతనాయక్ మాట్లాడుతూ నర్సరీల ఏర్పాటుకు లైసెన్సులు పొందే విధానం, రిజిస్టర్‌లు, రశీదు, బిల్లులు నిర్వాహణ గురించి అవగాహన కల్పించారు.

అటవీ భూముల రక్షణకు కృషి చేయాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: పర్యావరణ హితం, వాతావరణ కాలుష్యం కాకుండా కాపాడే అటవీ భూములను పటిష్ట విధానాలతో వివిధ శాఖల సమన్వయంతో కాపాడేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అటవీ రక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు నెమ్మదిగా కబ్జాచేసి ఆ తర్వాత పూర్తిగా ఆక్రమిస్తున్నారన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు వీటిని పరిశీలించాలన్నారు. అటవీ శాఖ నర్సరీలో ఉన్న మొక్కలను డిస్ట్రిక్ట్ ప్లాంట్ ఫొండేషన్ ప్లానింగ్‌లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు అందజేయాలన్నారు. ఉపాధి హామీలో చేపట్టే పనుల్లోనూ వీటిని చేర్చాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

లోకేష్‌కు సవాలు విసిరిన ఎమ్మెల్సీ సునీత



చీరాల: ఏ ప్రభుత్వ హయాంలో చేనేతల అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని నారా లోకేష్‌కు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత సవాల్ విసిరారు. గురువారం ఆమె తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఒక్కో మగ్గానికి రూ.4 వేలు చొప్పున ప్రతినెలా చెల్లిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా చేనేతలను మోసగించారన్నారు. ఆప్కోకు కేటాయించిన నిధులను దారిమళ్లించి వందలాది కోట్ల రూపాయలను తెలుగుదేశం పార్టీ నాయకులు దిగమింగారన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేనేతలకు ఎటువంటి మేలు జరిగిందో శ్వేతపత్రం విడుదల చేయాలని లోకేష్‌కు సవాలు విసిరారు. నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నారా లోకేష్ యువగళంలో చేనేతల అభివృద్ధిపై అన్నీ అబద్ధాలే చెప్పారన్నారు. గ్లోబెల్ ప్రచారం, దుర్మార్గపు రాతలతో చేనేతలను మోసం చేయాలని లోకేష్, చంద్రబాబు చూస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఏం మేలు చేస్తారో చెప్పకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లడం, మంత్రులను బూతులు తిట్టడం తప్ప యువగళంలో ప్రజలకు ఏం మేలు చేస్తారో చెప్పాలన్నారు.

చేనేతలను ఆదుకుంది సీఎం జగనే..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నేతన్న నేస్తం ద్వారా రూ.24 వేలు చొప్పున ఇప్పటి వరకు రూ.800 కోట్లు ఖర్చు చేశారన్నారు. 50 ఏళ్లకే పెన్షన్ కల్పించి చెల్లిస్తున్నారన్నారు.

పెదకూరపాడులో భారీ వర్షం

జలమయమైన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు

పెదకూరపాడు: పెదకూరపాడు మండల వ్యాప్తంగా గురువారం భారీవర్షం కురిసింది. మూడు రోజులుగా వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయింది. వాగులు పొంగిపొర్లుతున్నాయి. కాలచక్ర రోడ్డుపైకి వర్షపు నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

రేషన్ కార్డు లేకపోతే డీఎల్ఎస్ఏను సంప్రదించండి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి



వృద్ధాశ్రమంలో వసతులపై ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి

గుంటూరు లీగల్: ఆధార్ కార్డు లేకపోయినా, అర్హులై ఉండి రేషన్ కార్డు లేకపోయినా డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ)ను సంప్రదిస్తే జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి సూచించారు. క్యాలెండర్ కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని నిర్మల్ హృదయ్ వృద్ధాశ్రమంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి మాట్లాడుతూ సమస్యను రాత పూర్వకంగా లేదా టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలియజేస్తే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సీనియర్ సిటిజన్స్ చట్టం ద్వారా వృద్ధులకు సంక్రమించిన ప్రత్యేక హక్కులను విపులంగా వివరించారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్మల్ హృదయ్ వృద్ధాశ్రమం నిర్వాహకులు, పలువురు వృద్ధులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో తక్షణ చర్యలు

ఎస్పీ వకుల్ జిందాల్



మేదరమెట్ల: దిశ యాప్‌ద్వారా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. మేదరమెట్లలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై ఎస్పీ గురువారం బాపట్లలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తనను వేధిస్తున్నారని ఓ మహిళ మేదరమెట్ల పోలీసులకు దిశయాప్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పది నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు వ్యక్తిపై కేసు నమోదు చేశారని చెప్పారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం సోమవరప్పాడుకు చెందిన పేరం నీలిమను అదే గ్రామానికి చెందిన నరేంద్రవర్మ గతేడాది కాలంగా తనను ప్రేమించమని వేధిస్తున్నాడు. అదే క్రమంలో ఈనెల 21వ తేదీ రాత్రి నీలిమ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో నరేంద్రవర్మ ఇంటికి వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు వెంటనే దిశ యాప్‌ను ఉపయోగించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు స్పందించి ఘటనా స్థలానికి వెళ్లి రక్షించి వ్యక్తిపై కేసు నమోదు చేశారని చెప్పారు. కేవలం పది నిమిషాల్లోనే పోలీసులు చర్యలు చేపట్టడం వలన ఆమెను రక్షించగలిగారన్నారు. ప్రతి మహిళా దిశయాప్ గురించి తెలుసుకొని యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ముగ్గురు దోపిడీ దొంగల అరెస్టు

రూ.1.90 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



పట్టుకున్న నిందితులతో డీఎస్పీ మహేష్, సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది

నరసరావుపేట: రాత్రి వేళల్లో హైవే రహదారుల్లో ద్విచక్ర వాహనాలపై ఒంటరిగా ప్రయాణించే వారిపై దాడిచేసి దోచుకునే ముగ్గురు వ్యక్తులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.1.90లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కేవీ మహేష్ వెల్లడించారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన బత్తుల మహేష్, మొగిలి వెంకటేశ్వర్లు, తువ్వారపు పవన్, అల్లూరివారిపాలెం గ్రామానికి చెందిన కుంబా శ్రీనివాసరావు నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన నుసుం వెంకటేశ్వరరెడ్డి ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో ద్విచక్రవాహనంపై వస్తుండగా ఉప్పలపాడు గ్రామ శివారు ఏఎం రెడ్డి కళాశాలకు వెళ్లే కాలువ వద్ద అటకాయించి కొట్టి డబ్బులు, ద్విచక్రవాహనాన్ని దోచుకున్నారన్నారు. వెంకటేశ్వరరెడ్డి చేసిన ఫిర్యాదుపై జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ మహేష్ పర్యవేక్షణలో నరసరావుపేట, చిలకలూరిపేట రూరల్ సీఐలు సీఐ భక్తవత్సలరెడ్డి, వై.అచ్చయ్య, ఎస్ఐలు ఇ.బాలనాగిరెడ్డి, పి.హాజరత్తయ్య బృందంగా ఏర్పడి దర్యాప్తు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు యల్లమంద బైపాస్ రోడ్డు వద్ద పై నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.26,500 నగదు, బజాజ్ ప్లాటిన, హోండా షైన్ మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి మొత్తం విలువ రూ.1.90లక్షలు ఉంటుందన్నారు. పట్టుకున్న వారిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు. దర్యాప్తులో ప్రతిభ చూపించిన సిబ్బందికి ఎస్పీ రివార్డు ప్రకటించారని డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐలు బాలనాగిరెడ్డి, హాజరత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు అర్హత కార్డులు తప్పనిసరి



రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఏడీఏ మోహనరావు

పర్చూరు (చినగంజాం): కౌలు రైతులందరూ కౌలు రైతు అర్హత కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని చెరుకూరు గ్రామంలోని ఆర్బీకేలో సీసీఆర్డీ కార్డుల గురించి కౌలు రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులందరూ కౌలు కార్డులు తీసుకోవాలని, కార్డులు తీసుకున్న వారికి పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట ఉత్పత్తులను అమ్ముకోవటానికి, పంట రుణాలు, వైఎస్సార్ రైతు భరోసా పథకం నగదు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు సబ్సిడీపై ఇస్తారని చెప్పారు. కౌలు కార్డులు 11 నెలలు మాత్రమే అమలులో ఉంటాయని తెలిపారు. భూయజమానులు, రైతులు ఎటువంటి సంతకాలు చేయనవసరం లేదని తెలిపారు. కౌలు చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తిస్తుందని తెలిపారు. పర్చూరు మండలానికి మూడు డ్రోనులు 40 శాతం సబ్సిడీపై ఇస్తామని తెలిపారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా రైతులకు రూ.6 వేలు పొందాలంటే ఈ నెలాఖరులోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు పర్చూరు మండలంలో 91 శాతం పూర్తయిందన్నారు. సదస్సులో ఏవో రామ్మోహన్‌రెడ్డి రైతులకు ఇప్పటివరకు 150 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు విత్తనాలు 50 శాతం సబ్సిడీపై ఇచ్చామన్నారు. రైతులు గ్రామాల్లోని సీహెచ్‌సీ గ్రూపులకిచ్చిన వ్యవసాయ పరికరాలు అద్దెకు వాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో హుస్సేన్, వీఏఏ నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

ఆటో, బైకు ఢీకొని కూలీ దుర్మరణం

అద్దంకి: ఆటో బైకును ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అద్దంకి-దర్శి ఆర్‌అండ్‌బీ రహదారిలోని అద్దంకి పెరికపాలెం సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన వెంగలశెట్టి అంజయ్య కుమారుడు శ్రీనివాసులు(35) కూలి పనులు చేసుకొని జీవిస్తుంటాడు. ఈ క్రమంలో అద్దంకి వెళ్లి తిరిగి వస్తుండగా పట్టణంలోని పెరికపాలెం వద్ద ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య జ్యోతి, కుమారుడు ఉన్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భర్త మరణంతో భార్య కన్నీరు మున్నీరుగా విలపించింది. బంధువులు శోకసముద్రంలో మునిగారు.

ఇద్దరు డ్రై గంజాయి విక్రేతల అరెస్టు

ఆరు కిలోల గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ మహేష్

నగరంపాలెం: డ్రై గంజాయి విక్రయించే ఇద్దరిని ఎస్ఈబీ (సెబ్) గుంటూరు-2 స్టేషన్/డీఎస్ఈఓ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.30 వేలు విలువ చేసే ఆరు కిలోల డ్రై గంజాయి, ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని సెబ్-2 స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను గుంటూరు ఏఎస్పీ డీఎస్.మహేష్ వెల్లడించారు. ముందస్తు సమాచారంతో బుధవారం సాయంత్రం వెంగళాయపాలెం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు రూరల్ వెంగళాయపాలెం గ్రామ వాసి టి.జి, మౌలాలి, మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన కె.సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. మౌలాలి వద్ద అయిదు కిలోల గంజాయి, సాయికు మార్ వద్ద ఒక కిలో గంజాయిని గుర్తించారు. భవన నిర్మాణ పనులకు వెళ్లే మౌలాలి గత కొద్ది కాలం గా నర్సీపట్నం వెళ్లి గంజాయి తీసుకొచ్చి విక్రయాలు చేసేవాడని దర్యాప్తులో తెలిసింది. అక్కడ్నుంచి గంజాయి గుంటూరు తీసుకొచ్చేందుకు మౌలాలి రకరకాలుగా ప్రయత్నాలు చేసేవాడు. ద్విచక్ర వాహనంపై, ఆర్టీసీ బస్‌లోనూ, రైల్లోనూ వెళ్లేవాడని, ఇతరుల కంటపడకుండా ఉండేందుకు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించేవాడని చెప్పారు. సెబ్-2, డీఎస్ఈఓ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ, ఏఈఎస్ కె.మణికంట, శిక్షణ ఏఈఎస్ కె.జయమౌనిక, సీఐలు కె.కర్ణ (సెబ్-2), అంటోని (డీఎస్ఈఓ), ఎస్ఐ ఇ.కల్యాణచక్రవర్తి, హెచ్‌సీ పీవీ.పోతురాజు, కానిస్టేబుళ్లు కె.నాగరాజు, బి.వీరాంజనేయులు, కె.పూర్ణచంద్రరావు, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్యాషన్







ప్రింట్స్.. స్టైయిల్స్

ఫ్లోరల్, మల్టీకలర్ ప్రింట్స్ ఏవైనా మనసుకు ఎప్పుడూ ఆహ్లాదాన్నిస్తాయి. ఫ్యాబ్రిక్ ఏదైనా చూడముచ్చటగా ఉంటాయి. సీజన్‌తో పనిలేకుండా పార్టీ ఏదైనా ఇండోవెస్టన్ లుక్‌తో టాప్ టు బాటమ్ ఎవర్‌గ్రీన్ లుక్‌తో ప్రింటెడ్ ఆకట్టుకుంటున్నాయి. క్యాజువల్ వేర్‌గానూ కలర్‌ఫుల్ అనిపిస్తాయి. అందుకే, డిజైనర్లు ప్రింట్ కాన్సెప్ట్‌ను ఎప్పుడూ వినూత్నంగా మన ముందుకు తీసుకు వస్తుంటారు. వాటిలో కొన్ని డిజైన్స్ ఇవి.

లెహంగా శారీ, లాంగ్ కోట్, ట్రౌజర్, శారీ గౌన్, కుర్తా పైజామా.. మల్టీ కలర్ ప్రింట్లతో టాప్ టు బాటమ్ ఒకే కలర్ కాంబినేషన్‌ను ఎంచుకుంటే ఈ థీమ్‌కు సరిగ్గా నప్పుతుంది. ఈ స్టయిల్‌కి ఇతర యాక్సరీస్ కూడా అంతగా అవసరం ఉండదు. ప్రత్యేకంగా కనిపించే ఈ ప్రింటెడ్ డ్రెస్సులు ఎక్కడ ఉన్నా అంతే ప్రత్యేకతను చాటుతాయి.

మన నైటింగేల్

వృత్తే దైవంగా, సేవే పరమార్థంగా భావించిన తేజావత్ సుశీలకు ఈ యేడాది ప్రతిష్టాత్మక 'ఫ్లారెన్స్ నైటింగేల్' అవార్డు దక్కింది. తెలంగాణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం, ఎర్రగుంట ప్రాథమిక వైద్యశాలలో ఏఎన్ఎంగా సేవలందిస్తున్న సుశీల గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా 27 ఏళ్ల తన కెరీర్ గురించి సుశీల 'సాక్షి'తో పంచుకున్నారు.


అడవి బిడ్డల ఆత్మీయ నేస్తం... తేజావత్ సుశీల




"ఉమ్మడి ఖమ్మం జిల్లాలలోని వీ వెంకటాయపాలెం అనే గ్రామం మా సొంతూరు. 1996లో ఏఎన్ఎంగా తొలి పోస్టింగ్ మణుగూరులో వచ్చింది. ఆ తర్వాత సుజాతనగర్‌లో కొన్నాళ్లు పని చేశాను. 2010 నుంచి ఏజెన్సీ ప్రాంతమైన ఎర్రగుంట పీహెచ్‌సీలో పని చేస్తున్నాను. 27 ఏళ్ల కెరీర్‌లో పనిలోనే సంతృప్తి వెతుక్కుంటూ వస్తున్నాను. మా ఇల్లు, నాకు కేటాయించిన గ్రామాలు తప్ప పెద్దగా బయటకి పోయిందీ లేదు. హైదరాబాద్‌కు కూడా వెళ్లడం తక్కువే. చదువుకునేప్పటి నుంచి ఈ రోజు వరకు... ఏనాటికైనా ఢిల్లీని చూస్తానా అనుకునేదాన్ని. కానీ ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ వరకు నా ప్రయాణం ఉంటుందని అనుకోలేదు. దేశ ప్రథమ మహిళ చేతుల మీదుగా అవార్డు అందుకున్న క్షణాలు మరువలేనివి.

రెండు ప్రాణాలు

2010 సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి గుత్తి కోయలు తెలంగాణకు రావడం ఎక్కువైంది. నా పీహెచ్‌సీ పరిధిలో మద్దుకూరు సమీపంలో గుత్తికోయలు వచ్చి మంగళబోడు పేరుతో ఓ గూడెం ఏర్పాటు చేసుకున్నట్టు అక్కడి సర్పంచ్ చెప్పాడు. ఆ గ్రామానికి తొలిసారి వెళ్లినప్పుడు ఎవ్వరూ పలకరించలేదు. నేనే చొరవ తీసుకుని అన్ని ఇళ్లలోకి తలుపులు తీసుకుని వెళ్లాను. ఓ ఇంట్లో ఓ మహిళ అచేతనంగా పడుకుని ఉంది. పదిహేను రోజుల కిందటే ప్రసవం జరిగిందని చెప్పారు. తీవ్ర రక్తస్రావం కావడంతో మనిషి నీరసించిపోయి ఉంది. ఒళ్లంతా ఉబ్బిపోయి ఉంది. వెంటనే ఆ గ్రామ సర్పంచ్‌ను బతిమాలి ఓ సైకిల్ ఏర్పాటు చేసి అడవి నుంచి మద్దుకూరు వరకు తీసుకొచ్చాను. అక్కడి నుంచి ఆటోలో కొత్తగూడెం ఆస్పత్రికి వచ్చాం. పరిస్థితి విషమించడంతో వరంగల్ తీసుకెళ్లాలని సూచించారు. 108లో ఆమెను వెంటబెట్టుకుని వరంగల్‌కు తీసుకెళ్లాను. 21 రోజుల పాటు చికిత్స అందించిన తర్వాత ఆ తల్లిబిడ్డలు ఇద్దరూ ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడ్డారు. ఈ ఘటన తర్వాత అక్కడున్న వలస గుత్తి కోయలకు నాపై నమ్మకం కలిగింది. ఏదైనా సమస్య ఉంటే సంకోచం లేకుండా చెప్పుకోవడం మొదలు పెట్టారు.

రక్తం కోసం బతిమాలాను

ఓసారి గుత్తికోయగూడెం వెళ్లినప్పుడు పిల్లలందరూ నా దగ్గరకు వచ్చారు కానీ జెమిలీ అనే ఏడేళ్ల బాలిక రాలేదు. ఏమైందా అని ఆరా తీస్తూ ఆ పాప ఇంట్లోకి వెళ్లాను. నేలపై స్పృహ లేని స్థితిలో ఆ పాప పడుకుని ఉంది. బ్లడ్ శాంపిల్ తీసుకుని టెస్ట్ చేస్తే మలేరియా పాజిటివ్‌గా తేలింది. వెంటనే పీహెచ్‌సీకి అక్కడి నుంచి కొత్తగూడెం తీసుకువస్తే పాప పరిస్థితి చాలా సీరియస్‌గా ఉందని డాక్టర్లు చెప్పారు. ఖమ్మం తీసుకెళ్లమన్నారు. అక్కడకు వెళ్తే వరంగల్ పొమ్మన్నారు. కానీ డాక్టర్లను బతిమాలి అక్కడే వైద్యం చేయమన్నాను. ఆ పాపది ఓ నెగెటివ్ గ్రూప్ రక్తం కావడంతో చాలా మందికి ఫోన్లు చేసి బతిమాలి రెండు యూనిట్ల రక్తం సంపాదించగలిగాను. చివరకు ఆ పాప ప్రాణాలు దక్కాయి. మరోసారి ఓ గ్రామంలో ఓ బాలింత చంటిపిల్లకు ఒకవైపు రొమ్ము పాలే పట్టిస్తూ రెండో రొమ్ముకు పాలిచ్చేందుకు తంటాలు పడుతున్నట్టు గమనించాను. వెంటనే ఇన్‌ఫెక్షన్ గుర్తించి ఆస్పత్రికి తరలించాను.

అర్థం చేసుకోవాలి

మైదాన ప్రాంత ప్రజలకు ఒకటికి రెండు సార్లు చెబితే అర్థం చేసుకుంటారు. వారికి రవాణా సదుపాయం కూడా బాగుంటుంది. కానీ వలస ఆదివాసీల గుత్తికోయల గూడేల్లో పరిస్థితి అలా ఉండదు. ముందుగా వారిలో కలిసిపోవాలి. ఆ తర్వాత అక్కడి మహిళలను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే భర్త/తండ్రి తోడు రావాలి. వాళ్ల పనులకు వెళితే సాయంత్రం కానీ రారు. వచ్చే వరకు ఎదురు చూడాలి. వచ్చినా పనులు వదిలి ఆస్పత్రికి వచ్చేందుకు సుముఖంగా ఉండరు. ఆస్పత్రి కోసం పని వదులుకుంటే ఇంట్లో తిండికి కష్టం. అన్నింటికీ ఒప్పుకున్నా.... ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే అడవుల్లో ఉండే గుత్తికోయ గ్రామాలకు రవాణా కష్టం. క్షేత్రస్థాయిలో ఉండే ఈ సమస్యలను అర్థం చేసుకుంటే అత్యుత్తమంగా వైద్య సేవలు అందించే వీలుంటుంది.

కోవిడ్ సమయంలో

మద్దుకూరు, దామరచర్ల, సీతాయిగూడెం గ్రామాలు నా పరిధిలో ఉండేవి. కోవిడ్ సెకండ్ వేవ్ సమయంలో ఈ మూడు గ్రామాల్లో కలిపి ఒకేసారి 120 మందిని ఐసోలేషన్‌లో ఉంచాను. ఇదే సమయంలో మా ఇంట్లో నలుగురికి కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని గ్రామాలు తిరుగుతూ ప్రాణనష్టం రాకుండా సేవలు అందించాను. నా పరిధిలో ఉన్న గ్రామాల్లో ఏ ఒక్కరూ కోవిడ్‌తో ఇంట్లో చనిపోలేదు.

వారి సహకారం వల్లే

వృత్తిలో మనం చూపించే నిబద్ధతను బట్టి మన కంటూ ఓ గుర్తింపు వస్తుంది. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపుడు అర్ధరాత్రి ఫోన్ చేసినా డాక్టర్లు లిఫ్ట్ చేసి అప్పటికప్పుడు సలహాలు ఇస్తారు. అవసరాన్ని బట్టి హాస్పిటల్‌కు వచ్చి కేస్ అటెండ్ చేస్తారు. అదే విధంగా నాతో పాటు పని చేసే ఇతర సిబ్బంది పూర్తి సహకారం అందిస్తారు. ఇక ఆశా వర్కర్లు అయితే నా వెన్నంటే ఉంటారు. ఏదైనా పని చెబితే కొంత ఆలస్యమైనా ఆ పని పూర్తి చేస్తారు. వీరందరి సహకారం వల్లే నేను ఉత్తమ స్థాయిలో సేవలు అందించగలిగాను. ఈ రోజు నాకు దక్కిన గుర్తింపుకు డాక్టర్ల నుంచి ఆశావర్కర్ల వరకు అందరి సహకారం ఉంది" అని వివరించారు సుశీల.


● సుశీల

– తాండ్ర కృష్ణగోవింద్, సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం

న్యూస్‌మేకర్

వయసు 18 వృత్తి పైలెట్


● సాక్షి కొచ్చర్

సాక్షి కొచ్చర్‌కు ఇప్పటి దాకా స్కూటర్ నడపడం రాదు. కారు నడపడం రాదు. కాని ఏకంగా విమానం నడపడం నేర్చుకుంది. ప్రస్తుతానికి యంగెస్ట్ కమర్షియల్ పైలెట్ రికార్డ్ సాక్షి పేరున ఉంది. సంకల్పించాను... సాధించాను అంటోంది సాక్షి.

మన దేశంలో అత్యంత చిన్న వయసులో కమర్షియల్ పైలెట్ లైసెన్స్ సాధించిన రికార్డు మైత్రి పటేల్ పేరున ఉంది. ఆమె 19 ఏళ్ల లైసెన్స్ పొందింది. ఇప్పుడు 18 ఏళ్లకే సాక్షి కొచ్చర్ ఈ లైసెన్స్ పొంది మైత్రి రికార్డును బద్దలు కొట్టింది. సరిగ్గా ఆమె 18వ పుట్టిన రోజున ఈ లైసెన్స్ పొందడం విశేషం.

పదేళ్ల వయసు నుంచే

సాక్షి కొచ్చర్‌ది హిమాచల్ ప్రదేశ్‌కు ముఖద్వారం వంటిదైన పర్‌వాను టౌన్. అక్కడ తండ్రి లోకేష్ కుమార్ కొచ్చర్‌కు ఫుట్‌వేర్ వ్యాపారం ఉంది. పదేళ్ల వయసు నుంచి కుమార్తె పైలెట్ కావాలని కోరుకుంటూ ఉంటే అతడు ప్రోత్సహిస్తూ వచ్చాడు. 'పదో క్లాసు పరీక్షలు అయ్యాక నేను పైలెట్ కావాలని మళ్లీ ఒకసారి గట్టిగా చెప్పాను. అయితే నాకు కామర్స్ లైన్‌లో చదవాలని ఉండేది. లెక్కలు పెద్దగా ఇష్టం లేదు. కాని పైలెట్ కావాలంటే ఎంపీసీ చదవాలని తెలిసి ఇంటర్‌లో ఎంపీసీ తీసుకున్నాను' అని చెప్పింది సాక్షి. ఇంటర్ అయిన వెంటనే ముంబైలోని స్కైలైన్ ఏవియేషన్ క్లబ్‌లో పీపీఎల్ (ప్రైవేట్ పైలెట్ లైసెన్స్)కు కావలసిన థియరీ క్లాసులను నాలుగున్నర నెలల పాటు చదివింది సాక్షి. ఈ క్లబ్‌లోనే కెప్టెన్ ఏ.డి.మానెక్ దగ్గర ఏవియేషన్ పాఠాలు నేర్చుకుంది మైత్రి పటేల్. సాక్షి కూడా కెప్టెన్ మానెక్ దగ్గరే తొలి పాఠాలు నేర్చుకుంది. ఆ తర్వాత సీపీఎల్ (కమర్షియల్ పైలెట్ లైసెన్స్) కోసం అమెరికా వెళ్లింది.

70 లక్షల ఖర్చు

అమెరికాలో కమర్షియల్ పైలెట్ లైసెన్స్ పొందాలంటే దాదాపు 70 లక్షలు ఖర్చు అవుతుంది. అయినా సరే సాక్షి కుటుంబం ఆ ఖర్చును భరించి సాక్షిని అమెరికా పంపింది. అక్కడ మూడు నెలల పాటు సాక్షి ట్రైనింగ్‌లో పాల్గొంది. 'ఇన్‌స్ట్రక్టర్ సహాయంతో విమానం నడపడంలో ఒక రకమైన థ్రిల్ ఉంది. కాని ట్రైనింగ్‌లో భాగంగా మొదటిసారి సోలో ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్ లేకుండా) ఒక్కదాన్నే విమానం నడిపినప్పుడు కలిగిన థ్రిల్, ఆ ఫీలింగ్ మాటల్లో చెప్పలేను. ఆ క్షణం నా జీవితంలో అలాగే ఉండి పోతుంది' అని చెప్పింది సాక్షి. 'అయితే పైలెట్ కావడం అనుకున్నంత సులభం కాదు. ఎన్నో సవాళ్లు, సమస్యలు ఉంటాయి. నా ట్రయినింగ్‌లో ఒకసారి ఎలక్ట్రికల్ సిస్టమ్ ఫెయిల్ అయింది. మరోసారి రేడియో ఫెయిల్ అయింది. నేను కంగారు పడకుండా అలాంటి సమయంలో ఏం చేయాలో అది చేసి సేఫ్ లాండింగ్ చేశాను' అని తెలిపింది సాక్షి.

పైలెట్‌గా ఉద్యోగం

'మా ఊళ్లో నేను పైలెట్ అవుతానని అంటే మా బంధువులు చాలామంది ఎయిర్ హోస్టెస్ అనుకున్నారు. అమ్మాయిలు పైలెట్‌లు కావచ్చునని వారికి తెలియదు. ఇవాళ మన దేశంలో ఎక్కువమంది మహిళా పైలెట్‌లు ఉన్నారు. ఇది చాలా మంచి విషయం. నాకు పైలెట్‌గా ఉద్యోగం రాగానే నా కోర్సు కోసం అయిన ఖర్చు మొత్తం అణాపైసలతో సహా మా అమ్మానాన్నలకు చెల్లిస్తాను' అంది సాక్షి.

ఇంత చిన్న వయసులో లైసెన్స్ పొందిన సాక్షికి ఉద్యోగం రావడం ఎంత సేపనీ.

వంటిల్లు

చేదా..లేదే!

ఎంతమంచి వంటకం అయినా నోటికి రుచిగా లేకపోతే అస్సలు తినబుద్ధికాదు. ఇక చేదుగా ఉండే కాకర కాయ డిష్ అంటే.. "అమ్మో కాకరకాయ" అంటూ ముఖం మాడ్చేస్తారు. అనేక పోషకాలున్న కాకరకాయను మళ్లీమళ్లీ తినాలనిపించేలా ఎలా వండాలో చెబుతోంది ఈ వారం మన వంటిల్లు...

కాకరకాయ పకోడా



కావలసినవి: కాకరకాయలు – రెండు; శనగపిండి – అరకప్పు ; బియ్యప్పిండి – రెండు టేబుల్ స్పూన్లు ; కారం – టీస్పూను ; ఇంగువ – చిటికెడు ; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – రెండు కప్పులు.

తయారీ: ● కాకర కాయలను శుభ్రంగా కడిగి గుండ్రని/పొడవు ముక్కలుగా తరుక్కోవాలి. ● ముక్కల్లోని విత్తనాలను వేరుచేసి వెడల్పాటి ప్లేటులో వేయాలి. ● శనగపిండి, బియ్యప్పిండి, కారం, ఇంగువ రుచికి సరిపడా ఉప్పును ముక్కలపై చల్లాలి. ● ఇప్పుడు కొద్దికొద్దిగా నీళ్లు చల్లుకుంటూ పకోడీ పిండిలా గట్టిగా కలుపుకోవాలి. ● నూనె బాగా మరిగాక కలిపి పెట్టుకున్న ముక్కలను వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి తీసేయాలి.

బేక్డ్ కరేలా



కావలసినవి: కాకరకాయలు – అర కేజీ ; జీలకర్ర పొడి – అరటీస్పూను ; ధనియాల పొడి – ముప్పావు టీస్పూను ; ఆమ్‌చూర్ పొడి – ముప్పావు టీస్పూను ; కారం – టీస్పూను ; పసుపు – టీస్పూను ; బెల్లం పొడి – రెండు టేబుల్ స్పూన్లు ; నూనె ఒకటిన్నర టేబుల్ స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా ; కొత్తిమీర తరుగు – గార్నిష్‌కు సరిపడా; నిమ్మరసం – టీస్పూను.

తయారీ: ● కాకరకాయలను శుభ్రంగా కడిగి పలుచగా తొక్క తీసి గుండ్రని ముక్కలుగా తరగాలి. ● తరిగిన ముక్కలపై నూనెవేసి కలపాలి. ● ముక్కలన్నింటికి నూనె పట్టిన తరువాత జీలకర్ర, ధనియలపొడి, ఆమ్‌చూర్ పొడి, పసుపు, కారం, రుచికి సరిపడా ఉప్పు, బెల్లం పొడి వేసి ముక్కలకు పట్టించి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. ● ఇరవైనిమిషాల తరువాత బేకింగ్ ట్రేలో అల్యూమినియం ఫాయిల్ వేసి కొద్దిగా నూనె చల్లి, కాకరకాయ ముక్కలను పలుచగా పోయాలి. ● ఈ ట్రేని అవెన్‌లో పెట్టి 25 నిమిషాలు బేక్ చేసి తీసేయాలి. ● వేడివేడి ముక్కలపై నిమ్మరసం చల్లి, కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి. అన్నం, రోటీలోకి ఇది మంచి సైడ్ డిష్.

బిట్టర్ ఆమ్లెట్



కావలసినవి: కాకరకాయ – మీడియం సైజుది ఒకటి ; గుడ్లు – మూడు ; ఉప్పు – రెండు టీస్పూన్లు ; గరం మసాలా – అరటీస్పూను ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు.

తయారీ: ● కాకర కాయను శుభ్రంగా కడిగి, విత్తనాలు తీసేసి సన్నగా తరగాలి. ● మరుగుతోన్న నీళ్లలో కొద్దిగా నూనె, టీస్పూను సాల్ట్ , కాకరకాయ ముక్కలు వేసి ఐదు నిమిషాలు ఉడికించాలి. ● ఉడికిన ముక్కలను నీటినుంచి వేరు చేసి, తడిలేకుండా తుడిచి పక్కన పెట్టుకోవాలి. ● గిన్నెలో గుడ్లసొనను వేసి చక్కగా కలపాలి. ఈ సొనలో రుచికి సరిపడా ఉప్పు, గరం మసాలా, కాకరకాయ ముక్కలు వేసి కలపాలి. ● పెనం మీద నూనెవేసి, వేడెక్కిన తరువాత గుడ్ల మిశ్రమం వేసి రెండు వైపులా చక్కగా కాల్చితే బిట్టర్ ఆమ్లెట్ రెడీ.

కాకరకాయ పచ్చడి



కావలసినవి: కాకరకాయలు – పెద్దవి రెండు ; పచ్చిమిర్చి – పన్నెండు ; చిన్న ఉల్లిపాయలు – పదిహేను ; అల్లం – అంగుళం ముక్క ; పచ్చికొబ్బరి తురుము – అరకప్పు ; గడ్డ పెరుగు – రెండు కప్పులు , ఆవాలు – అరటీస్పూను, మెంతులు – పావు టీస్పూను ; ఎండు మిర్చి – రెండు ; కరివేపాకు – ఐదు రెమ్మలు ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, కారం – చిటికెడు.

తయారీ: ● కాకరకాయలను నీటిలో నానబెట్టి శుభ్రంగా కడిగి విత్తనాలు తీసేయాలి. ఇప్పుడు కాకరకాయలను చిన్నచిన్న ముక్కలుగా తరుక్కోవాలి. ● అల్లం తొక్కతీసి సన్నగా తరగాలి. 10 పచ్చిమిర్చి, 12 ఉల్లిపాయలను కూడా సన్నని ముక్కలుగా కట్ చేయాలి. ● కాకరకాయ, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలను ఒక గిన్నెలో వేయాలి. దీనిలో కరివేపాకు, కొద్దిగా ఉప్పు, టీస్పూను నూనెవేసి చక్కగా కలుపుకోవాలి. ● ఈ మిశ్రమం మొత్తాన్ని బాణలిలో వేసి రెండు నిమిషాలు పెద్దమంట మీద వేయించాలి. తరువాత మూతపెట్టి సన్న మంట మీద పది నిమిషాలు మగ్గనివ్వాలి. ● మధ్యలో కలుపుతూ... అడుగంటితే మరో టీస్పూను నూనె వేయాలి. ● కొబ్బరి తురుముకు మూడు ఉల్లిపాయలు, రెండు పచ్చిమిరపకాయలు, రెండు టేబుల్ స్పూన్ల నీళ్లు జోడించి పేస్టు చేయాలి. ● బాణలిలో మగ్గుతున్న మిశ్రమంలో ఈ పేస్టు వేసి, కలిపి ఐదు నిమిషాల తరువాత దించేయాలి. ● పెరుగుని సమంగా కలుపుకుని మగ్గిన మిశ్రమంలో వేయాలి. రుచికి సరిపడా ఉప్పు కలిపి తిప్పాలి. ● మిగిలిన నూనెతో ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకుతో తాలింపు వేసి కలుపుకోవాలి. చివరిగా కారం చల్లుకుని సర్వ్‌చేసుకోవాలి.